సాక్షి
ఆదిలాబాద్
సోమవారం । 21 । ఏప్రిల్ । 2025



ఈత సరదా.. కారాదు విషాదం
ఈత సరదా కొన్నిసార్లు ప్రాణాలమీదకు తెస్తోంది. పలువురిని బలిగొంటోంది. తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుస్తోంది. 8లో▸



ఘనంగా ఈస్టర్ వేడుకలు
ఈస్టర్ వేడుకలను జిల్లాలో క్రైస్తవులు ఆదివారం నిర్వహించుకున్నారు. జిల్లాకేంద్రంలోని పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
42.0/28.0

వాతావరణం
పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండతీవ్రత అధికంగా ఉంటుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



సన్మాన గ్రహీతలతో ఫైర్ అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: అప్రమత్తతతోనే ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సురేశ్ కుమార్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆ శాఖ కార్యాలయంలో రిటైర్డ్ ఉద్యోగులను ఆదివారం సన్మానించారు. శాలువాతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే ఫైర్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రమాదాల నివారణపై వారం పాటు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ రాజేశ్వర్, ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ జగత్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎల్‌టీఏ జిల్లా కార్యవర్గం



నూతన అధ్యక్ష, కార్యదర్శులు అజయ్‌కుమార్, సంజీవ్‌రావు

ఆదిలాబాద్ టౌన్: ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్ అసోసియేషన్ (ఈఎల్‌టీఏ) జిల్లా కార్యవర్గాన్ని పట్టణంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.అజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సంజీవ్‌రావు, ఉపాధ్యక్షులుగా బాలాజీ, భగవాండ్లు, జె.స్వరూపరాణి, కోశాధికారిగా చిన్న నర్సింలు, సంయుక్త కార్యదర్శులుగా ఇ.సంజయ్ ఎన్నికయ్యారు.

'ఓపెన్' పరీక్షలు ప్రారంభం



పరీక్ష రాస్తున్న అభ్యాసకులు

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఓపెన్ స్కూల్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉట్నూర్‌లో టెన్త్, ఇంటర్ కేంద్రాలు ఒక్కోటి చొప్పున, అలాగే జిల్లా కేంద్రంలో టెన్త్ రెండు, ఇంటర్ ఒక కేంద్రం ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు కొనసాగాయి. ఉదయం నిర్వహించిన పదో తరగతి పరీక్షకు 355 మందికి గాను 328 మంది హాజరు కాగా, 27 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఇంటర్ పరీక్షలకు 380 మందికి గాను 52 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పదో తరగతి పరీక్షకు 13 మందికి గాను నలుగురు హాజరు కాగా, తొమ్మిది మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలకు ఇద్దరికి గాను ఇద్దరు హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అశోక్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.



స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క, ఎంపీ నగేశ్, ఎమ్మెల్సీ విఠల్, ఎమ్మెల్యే బొజ్జు తదితరులు

భూమి కోసం.. భుక్తి కోసం.. విముక్తి కోసం పోరాడి ప్రాణాలను త్యజించిన ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినోత్సవంను ప్రభుత్వం తొలిసారిగా అధికారికంగా నిర్వహించింది. ఆంక్షలు లేకుండా వేడుకలు నిర్వహించడంపై ఆదివాసీలు హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడిజిల్లా నుంచి ఆదివారం తరలివచ్చిన గిరిపుత్రులు 1981 ఏప్రిల్ 20న అమరులైన వీరులకు స్వేచ్ఛగా నివాళులర్పించారు. తొలుత ఇంద్రవెల్లిలోని గోండ్‌గూడ నుంచి తమ సంప్రదాయ వాయిద్యాల నడుమ స్తూపం వరకు చేరుకున్నారు. స్మారక జెండా వద్ద పూజలు చేశారు. అనంతరం అమరులకు నివాళులర్పించారు.
– ఇంద్రవెల్లి/కైలాస్‌నగర్

అమరులారా వందనం



కార్యక్రమానికి హాజరైన ఆదివాసీ మహిళలు



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన ఎంపీ నగేశ్, ఎమ్మెల్యేలు బొజ్జు, ప్రేమ్‌సాగర్‌రావు తదితరులు

- అధికారిక స్మరణం.. ఆదివాసీల సంబురం
- 44 ఏళ్ల తర్వాత ఇంద్రవెల్లిలో స్వేచ్ఛగా నివాళి
- అమరుల త్యాగాలను స్మరించుకున్న నేతలు
- ఇచ్చిన మాట నెరవేర్చామన్న మంత్రి సీతక్క

అమరవీరుల కుటుంబాలకు వాహనాలు..

అమరవీరుల కుటుంబీకుల్లోని భోరుజ్‌గూడ గ్రామానికి చెందిన హెరేకుమ్ర సావిత్రి బాయి, అనంతపూర్ గ్రామానికి చెందిన తొడసం హనుమంత్‌రావ్, సిరికొండ మండలంలోని సోన్‌పల్లి గ్రామానికి చెందిన సిడాం జంగు, పెందోర్ సీతాబాయిలకు ట్రైకార్ పథకం ద్వారా మూడు ట్రాక్టర్లు, ఒక బొలెరో వాహనాలను మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, ఉట్నూర్ మండలాలతో పాటు శ్యాంపూర్ మండల సమాఖ్యలకు రూ.159.62 కోట్ల విలువైన స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీతో కూడిన రుణాల చెక్కులు అందజేశారు.

ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్మృతివనంలో ఆదివారం నిర్వహించిన వేడుకలకు రాష్ట్ర మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు, జీసీసీ చైర్మన్ కొట్నాక్ తిరుపతి, మాజీ ఎంపీలు సోయం బాపూరావ్, వేణుగోపాలాచారి, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణతో కలిసి పూజలు చేసి జెండా ఆవిష్కరించారు. స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అధికారికంగా సంస్మరణ దినోత్సవం నిర్వహించామన్నారు. ఆదివాసీలకు ఆర్‌వోఎఫ్‌ఆర్ ద్వారా భూ హక్కు కల్పించామని పేర్కొన్నారు. ఏజెన్సీలోని సమస్యలను పరిష్కరించేలా ఐటీడీఏ పీవో, కలెక్టర్, అటవీ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. స్మృతివనాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్ది ఆగస్టు 9న అధికారికంగా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్రం భుజంగ్‌రావు రచించిన 'ఆ గాయానికి 44 ఏళ్లు' పేరిట ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. మరోవైపు స్తూపం వద్ద, పరిసర ప్రాంతంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, పలువురు ఆదివాసీ సంఘాల నాయకులు, సార్‌మేడీలు, పటేళ్లు పాల్గొన్నారు. కార్యక్రమం ముగిసిన తర్వాత ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్‌లు తమ పార్టీ కార్యకర్తలతో కలిసి స్తూపం వద్ద నివాళులర్పించారు. వారి వెంట ఆదివాసీలు తదితరులున్నారు.

పెండింగ్ నిధులు విడుదల చేయాలి



ఇంద్రవెల్లి అమరవీరుల దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. అలాగే ఏజెన్సీ పరిధిలో సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర స్థాయిలో చర్యలు తీసుకోవాలి. పెండింగ్ నిధులు త్వరగా విడుదల చేయాలి. ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలు నిర్వహించడంతో పాటు పాలసీ విధానాలను అమలు చేసేలా చూడాలి.
– గోడం నగేశ్, ఆదిలాబాద్ ఎంపీ

మాట నిలుపుకున్న సీఎం..



గతంలో అమరవీరులకు నివాళులర్పించాలంటే ఎన్నో ఆంక్షలు ఉండేవి. కొట్లాడి సాధించుకున్న స్వరాష్ట్రంలోనైనా పరిస్థితి మారుతుందేమోనని ఆశించాం. కానీ పదేళ్లలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏనాడు పట్టించుకోలేదు. పీసీసీ హోదాలో ఇంద్రవెల్లిలో పర్యటించిన రేవంత్‌రెడ్డి సీఎం కాగానే ఇంద్రవెల్లి స్మృతివనానికి ఇచ్చిన మాట ప్రకారం రూ.కోటి కేటాయించారు. 15 మంది అమరవీరుల కుటుంబీకులను గుర్తించి వారిలో కొంత మందికి సాయం అందించాం. ఇంకా ఉన్నారని తెలుస్తోంది. వారిని సైతం అధికారికంగా గుర్తించి సాయం అందించేలా చూస్తాం.
– వెడ్మ బొజ్జు, ఖానాపూర్ ఎమ్మెల్యే

మరో పోరాటం తలెత్తకుండా చూడాలి



ఏజెన్సీ ప్రాంతంలో అటవీ సమస్యలతో ఆదివాసీల్లో అసంతృప్తి దాగి ఉంది. అటవీ అధికారులు ఆదివాసీలు సాగు చేస్తున్న భూముల్లోకి వెళ్లి మొక్కలు నాటడం, ట్రెంచులు కొట్టడంతో వారు సతమతం అవుతున్నారు. అలాంటి వారు మరో పోరాటానికి వెళ్లకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి. 44ఏళ్ల పోరాటం తర్వాత అమరవీరుల సంస్మరణను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం శుభసూచకం.
– దండే విఠల్, ఎమ్మెల్సీ

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



ఇంద్రవెల్లి అమరుల పోరాటం భూమి కోసం.. భుక్తి కోసం.. విముక్తి కోసం సాగింది. జల్ జంగల్ జమీన్ నినాదంతో కుమురంభీం పోరాడారు. ఈ నినాదాన్ని అమరవీరుల స్మారక బోర్డుపై రాయడం సరికాదు. దాన్ని సవరించాలి. ఆదివాసీల మనోభావాలు గుర్తించి వేడుకలను అధికారికంగా నిర్వహించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఏజెన్సీలో 5, 6వ షెడ్యూల్ రావడానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం.
– సోయం బాపూరావు, ఆదిలాబాద్ మాజీ ఎంపీ

పాలనలో రాజర్షి మార్క్



నీతి ఆయోగ్ అవార్డుకు ఎంపికైనట్లు కేంద్రం నుంచి కలెక్టర్‌కు అందిన లేఖ



ఇటీవల స్కోచ్ అవార్డు అందుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

- ఏడాదిలోనే రెండు జాతీయ అవార్డులు
- గవర్నర్ చేతుల మీదుగా మరో పురస్కారం
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో జిల్లాకు గుర్తింపు
- నేడు ప్రధాని చేతుల మీదుగా నీతి ఆయోగ్ అవార్డు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ కలెక్టర్‌గా రాజర్షి షా తన మార్కు చూపుతున్నారు. అడవులు, ఆదివాసీ జిల్లాగా ముద్రపడ్డ ఆదిలాబాద్ అభివృద్ధే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో అర్హులకు అందేలా కృషి చేస్తున్నారు. వాటి అమలు తీరుపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ వారికి దిశానిర్దేశం చేస్తున్నారు. స్వయంగా క్షేత్రస్థాయి పర్యటనలతో పరిస్థితులను అవగతం చేసుకుంటూ లోటు పాట్లను సరిదిద్దేలా చర్యలు చేపడుతున్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించే వారిపై కఠినంగా వ్యవహరించడంతో పాటు అక్రమార్కులకు తనదైన శైలిలో చెక్ పెడుతున్నారు. బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన నేపథ్యంలోనే రెండు జాతీయ స్థాయి అవార్డులు, ఒక రాష్ట్రస్థాయి పురస్కారం వరించడం తన మార్క్ పాలనకు అద్దం పడుతోంది. సోమవారం ఢిల్లీ వేదికగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా నీతి ఆయోగ్ అవార్డు అందుకోనున్నారు. ఈ నేపథ్యంలో రాజర్షి షా పాలనాదక్షతపై ప్రత్యేక కథనం.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడంపై రాష్ట్రస్థాయి పురస్కారం..

- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సీఈసీ చేపట్టిన బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన రాజర్షి షా గతేడాది మార్చి 6న ఆదిలాబాద్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. స్వల్ప వ్యవధిలోనే జిల్లా పరిస్థితులను అవగతం చేసుకున్నారు. అధికారులకు దిశానిర్దేశం చేస్తూ ఎంపీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకమైన ఓటరు జాబితా సిద్ధం చేసినందుకు గాను కేంద్ర ఎన్నికల సంఘం ప్రశంసలు అందుకున్నారు. అలాగే రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

'ఆరోగ్య పాఠశాల– కళాశాల' అమలుతో వరించిన 'స్కోచ్'

- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పరిశీలనలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన ద్వారా ప్రభుత్వ బడులను తనిఖీ చేశారు. ఈ సమయంలో ఆయా పాఠశాలల్లోని స్థితిగతులు, విద్యార్థుల అలవాట్లను గమనించిన కలెక్టర్ వాటిని మార్చాలని సంకల్పించారు. బాలల దినోత్సవం పురస్కరించుకుని గతేడాది నవంబర్ 14న 'ఆరోగ్య పాఠశాల– కళాశాల' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు ఆరోగ్య సంరక్షణ, చదువులో రాణించేందుకు అనుసరించాల్సిన కార్యక్రమాలపై వారంలో ఏడు రోజుల పాటు రోజుకో కార్యక్రమాన్ని నిర్దేశించారు. ప్రతీ పాఠశాలకు గైడ్ టీచర్‌తో పాటు స్టూడెంట్ చాంపియన్లను ఎంపిక చేశారు. కార్యక్రమ అమలుపై ప్రతీ వారం సమీక్ష నిర్వహించారు. ప్రగతిపై ఆరా తీస్తూ లోటుపాట్లను సవరించారు. స్వల్ప వ్యవధిలోనే విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల్లో మార్పు వచ్చేందుకు కృషి చేశారు. ఈ కార్యక్రమం సఫలీకృతం చేసి స్కోచ్ దృష్టిని ఆకర్షించారు. ఇటీవల జాతీయ స్థాయి అవార్డును అందుకున్నారు.

నీతి ఆయోగ్ పురస్కారానికి ఎంపిక

- నీతి ఆయోగ్ అమలు చేస్తున్న బ్లాక్ ఆస్పిరేషనల్ ప్రోగ్రాం– 2024కు గాను ప్రధానమంత్రి ప్రజాస్వామ్య పరిపాలన ఉత్తమ పురస్కారానికి కలెక్టర్ ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా 426 ఆస్పిరేషనల్ బ్లాకుల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తుండగా జిల్లాలోని నార్నూర్ టాప్–5లో నిలువడం కలెక్టర్ పాలనాదక్షతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఏప్రిల్ 2022 నుంచి డిసెంబర్ 2024 వరకు ఆ బ్లాక్‌లో ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యవసాయం, సామాజిక అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై నీతి ఆయోగ్ దృష్టి సారించింది. ఆ సంస్థ మార్గదర్శకాలను పక్కాగా పాటిస్తూ నార్నూర్ మండలం పలు రంగాల్లో ప్రగతిని సాధించింది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరైన పోషకాహారం అందించి గర్భిణులు, చిన్నారులు, బాలింతల ఆరోగ్యం మెరుగుపరడంతో పాటు ప్రాథమిక శిశు సంరక్షణ, విద్యా ఫలితాలు, డిజిటల్ పరిజ్ఞానం, ఆర్థిక చేకూర్పు, గిరిజన విద్యార్థుల సంక్షేమం, సహజ వ్యవసాయం, చెక్ డ్యాంల నిర్మాణం, స్వయంసహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందించడం, మోడల్ సీఎస్సీ సెంటర్ ద్వారా ప్రజల జీవనోపాధిలో పురోగతి సాధించింది. వాటిపై పలు విడతల్లో మదింపు చేసిన నీతి ఆయోగ్ అధికారులు ఐదు ప్రధాన అంశాల్లో సాధించిన సమగ్ర అభివృద్ధికి గాను జిల్లా అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమంలో భాగంగా ఈ అవార్డుకు ఎంపిక చేశారు. సివిల్ సర్వీసెస్ డే పురస్కరించుకుని సోమవారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా కలెక్టర్ ఈ అవార్డు అందుకోనున్నారు.

అందరి సహకారంతోనే..



కేంద్రం నిర్దేశించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలను నార్నూర్ బ్లాక్‌లో పకడ్బందీగా అమలు చేశాం. అడ్మినిస్ట్రేషన్ విభాగంలో నీతి ఆయోగ్ అవార్డు రావడం జిల్లాకు జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపునిస్తోంది. మంత్రి సీతక్కతో పాటు జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలందరి సహకారంతోనే ఈ అవార్డు లభించింది. సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఈ అవార్డు జిల్లా అభివృద్ధికి మరింత తోడ్పడనుంది.
– రాజర్షి షా, కలెక్టర్

క్రీడా శిక్షణకు వేళాయే

- మే 1నుంచి వేసవి శిబిరాలు
- పలు క్రీడాంశాల్లో ఉచిత శిక్షణ
- శిక్షకులకు ఇప్పటికే సామగ్రి పంపిణీ
- జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాలు
- ఈనెల 27వరకు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు (ఫైల్)

ఆదిలాబాద్: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు మెరుగుపరచాలనే ఉద్దేశంతో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఏటా వేసవిలో ప్రత్యేక శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోంది. విద్యార్థులు ఆయా క్రీడాంశల్లో ఆసక్తి పెంపొందించడంతో పాటు వారు రాణించేలా నెల రోజుల పాటు ప్రత్యేక శిక్షణ అందజేస్తోంది. అర్హత కలిగిన శిక్షకుల నుంచి ఇప్పటికే దరఖాస్తులు ఆహ్వానించి ఎంపిక చేసింది. జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన కేంద్రాల్లో శిక్షణ అందించేందుకు సమాయత్తమవుతోంది. ఇప్పటికే కలెక్టర్ రాజర్షి షా సంబంధిత శిక్షకులకు సామగ్రి సైతం అందజేశారు.

34 శిక్షణ కేంద్రాల్లో..

ఈ ఏడాది జిల్లాలోని 34 కేంద్రాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 25మంది , పట్టణ ప్రాంతాల్లో 9మంది శిక్షకులు విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వనున్నారు. మే1నుంచి 31వరకు బాక్సింగ్, బ్యాడ్మింటన్ వంటి ఇండోర్ క్రీడలతో పాటు హాకీ, క్రికెట్, వాలీబాల్, అథ్లెటిక్స్ వంటి అవుట్ డోర్ క్రీడల్లో సైతం శిక్షణ కల్పించనున్నారు. ఇప్పటికే శిక్షకులకు క్రీడా సామగ్రి సైతం అందించారు. ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు శిక్షణ ఉంటుందని. సుమారు 1000 మంది వరకు బాలలకు లబ్ధి చేకూరే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

అర్హులు ఎవరంటే..

శిబిరాల్లో 14 ఏళ్లలోపు బాల, బాలికలకు మాత్రమే శిక్షణ అందజేస్తారు. ఈ మేరకు అర్హులు ఈనెల 27వరకు https:// forms. gle/ xAtXkCvSJgzdpidS7 ఆన్‌లైన్ లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈ ప్రక్రియ పూర్తి చేసుకున్న వారికి ఎంపిక చేసుకున్న క్రీడాంశంలో నెల రోజుల పాటు ఉచిత శిక్షణ అందిస్తారు.

విధి, విధానాలు ఇలా..

జిల్లా వ్యాప్తంగా 10 శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే కొంతమంది స్వచ్ఛందంగా శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. శిక్షకుడికి రూ.4వేల గౌరవ వేతనంతోపాటు క్రీడా సామగ్రి కొనుగోలు నిమిత్తం మొత్తం రూ.50వేలు మంజూరు చేసింది.

నెలపాటు ఉచిత శిక్షణ..

14 ఏళ్ల లోపు బాల, బాలికలకు నెల రోజులపాటు వివిధ క్రీడాంశాల్లో ఉచిత శిక్షణ అందించనున్నాం. ఈ మేరకు శిక్షకులను ఎంపిక చేసి క్రీడా సామగ్రిని సైతం అందజేశాం. శిక్షకుల వేతనం, క్రీడా సామగ్రి కొనుగోలుకు సంబంధించి మొత్తం రూ. 50వేల చొప్పున మంజూరు చేస్తూ ఉత్తర్వులు అందాయి. ఈ శిక్షణను బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలి. – వెంకటేశ్వర్లు, డీవైఎస్‌వో

జిల్లావ్యాప్తంగా క్రీడా శిబిరాల వివరాలు..

గ్రామీణ ప్రాంతాల్లో..

క్రీడాంశం	శిబిరం ఇన్‌చార్జి	క్యాంప్ స్థలం	సెల్ నంబర్
అథ్లెటిక్స్	రాకేశ్	బెల్లూరి	97049 44283
అథ్లెటిక్స్	జి.సునంద్	ఉట్నూర్	99894 03069
అథ్లెటిక్స్	పి.రాజేశ్	చాందా(టి)	94921 36510
ఆర్చరీ	మారుతి/రవీందర్	చింతఘాట్	94914 68654
హాకీ	శేఖర్	ఉట్నూర్	80089 71963
హాకీ	జి.రవీందర్	భరంపూర్	96669 07755
హాకీ	షేక్ షబ్బీర్	మర్లపల్లి	81211 75659
వాలీబాల్	దయాకర్	కేస్లాపూర్	93811 59116
వాలీబాల్	పిసారాం	నందిగావ్	81215 35200
వాలీబాల్	మహేందర్	నార్నూర్	91829 45202
వాలీబాల్	జైతు	గుంజాల	--
వాలీబాల్	శ్రీనివాస్	మాన్కపూర్	72076 91916
వాలీబాల్	అఖిలేష్	చాందా(టి)	96660 01285
వాలీబాల్	రామిరెడ్డి	ఖాప్రి	79816 71724
వాలీబాల్	సందీప్	దుర్గానగర్	97015 87819
వాలీబాల్	ఎస్.స్వామి	భీంసరి	98487 36476
వాలీబాల్	కాంతారావు	పొచ్చర	94935 34163
ఖోఖో	పొచ్చన్న	ఖోడద్	97019 65056
ఖోఖో	శివకృష్ణ	ఉట్నూర్	89788 10993
క్రికెట్	ఎ.మహేందర్	నార్నూర్	91829 45202
సాఫ్ట్‌బాల్	జి.గంగాధర్	నేరడిగొండ	90005 65142
బేస్‌బాల్	పవన్	అంకోలి	--
హ్యాండ్‌బాల్	వివేక్	గుడిహత్నూర్	93984 34886
బ్యాడ్మింటన్	కె.మహేశ్	దుర్గానగర్	--
కబడ్డీ	ఎం.విఠల్ రెడ్డి	మావల	70131 70041

పట్టణ ప్రాంతాల్లో..

క్రీడాంశం	శిబిరం ఇన్‌చార్జి	క్యాంప్ స్థలం	సెల్ నంబర్
బాక్సింగ్	సాయికుమార్	డీఎస్‌ఏ, ఆదిలాబాద్	81065 56176
జూడో	ఎస్.రాజు	డీఎస్‌ఏ, ఆదిలాబాద్	77803 69672
అథ్లెటిక్స్	రమేశ్	డీఎస్‌ఏ, ఆదిలాబాద్	91774 78427
హ్యాండ్‌బాల్	సింధు	మహాలక్ష్మివాడ	63008 07110
హ్యాండ్‌బాల్	హరిచరణ్	తిర్పెల్లి	63008 07110
హాకీ	శ్రీనివాస్	కేఆర్‌కే, స్టేడియం	94941 48474
తైక్వాండో	వీరేష్	డీఎస్‌ఏ, ఆదిలాబాద్	70122 81284
బ్యాడ్మింటన్	కబీర్‌దాస్	ఆదిలాబాద్	94907 40567
రెజ్లింగ్	శ్రీధర్	డీఎస్‌ఏ, ఆదిలాబాద్	86864 26300

ఈత సరదా.. కారాదు విషాదం

- నీట మునిగి ప్రాణాలు కోల్పోతున్న విద్యార్థులు, యువకులు
- తల్లిదండ్రులకు తీరని శోకం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు

లక్ష్మణచాంద: ఈతకు వెళ్లడం అంటే ఎవరికైనా సరదాగానే అనిపిస్తుంది. వేసవికాలం వచ్చిందంటే చాలు ఎండ వేడిమి నుంచి ఉపశమనానికి గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో చిన్నాపెద్ద తేడాలేకుండా చెరువులు, వాగులు, స్విమ్మింగ్ పూల్స్‌లో సరదాగా ఈత కొడుతుంటారు. అయితే ఈత సరదా కొన్నిసార్లు ప్రాణాలమీదకు తెస్తోంది. పలువురి ప్రాణాలు బలిగొంటోంది. నీటిలోకి దిగి ఈతరాక అందులో మునిగి ప్రాణాలు కోల్పోయి తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుస్తున్నారు. మరో నాలుగు రోజుల్లో వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు సరదాగా ఈత కసం చెరువులు, కుంటలు, బావుల వద్దకు వెళ్తారు. ఈ నేపథ్యంలో పిల్లలను ఓ కంట కనిపెట్టాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో జరిగిన కొన్ని సంఘటనలు

- ఈ నెల 18న మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని పారుపల్లికి చెందిన పూరెళ్ల అశోక్ (20) శుక్రవారం తన పుట్టినరోజు కావడంతో సాయంత్రం గ్రామ సమీపంలోని గోదావరిలోకి స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు.
- ఎనిమిదేళ్ల క్రితం నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్‌కు చెందిన ముగ్గురు పదేళ్లలోపు చిన్నారులు ఆడుకుంటూ గ్రామ సమీపంలోని చెరువువద్దకు వెళ్లి అందులో పడి మృతి చెందారు.
- ఈ ఏడాది మార్చి 4న మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు చెందిన గూడెం సత్యనారాయణ (41) స్నానం చేసేందుకు గోదావరినదికి వెళ్లి ఈతరాక నీటమునిగి మృతి చెందాడు.
- ఈఏడాది మార్చి30న ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని గంగాపూర్‌కు చెందిన శంకర్ (20) కెరమెరి మండలంలోని శంకర్ లొద్దికి దైవ దర్శనానికి వెళ్లాడు. స్నానం చేసేందుకు చెరువులో దిగి నీటమునిగి మృతి చెందాడు.


వడ్యాల్‌లో వాగులోంచి బయటకు తీసుకువస్తున్న రాంచరణ్ మృతదేహం

- ఈ నెల 5న ఆదిలాబాద్ జిల్లా మావల శివారులోని చెరువులో ఈతకు వెళ్లిన పదేళ్లలోపున్న సంజీవ్, రాహుల్ ఈతరాక నీటమునిగి మృతి చెందారు.
- 2020లో మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని మాదారం టౌన్‌షిప్‌కు చెందిన వాసు (13), సతీశ్ (14) గ్రామ శివారులోని వ్యవసాయ కుంటలో ఈతకొట్టేందుకు వెళ్లి నీటమునిగి మృతి చెందారు.
- 2024 నవంబర్ 1న మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలంలోని దుగ్నేపల్లికి చెందిన కొండ అరుణ్ కుమార్ (18), దాసరి సాయి (16) సుందరశాల సమీపంలోని గోదావరిలో స్నానానికి వెళ్లి నీటిలో మునిగి మృతి చెందారు.
- 2024 మార్చి 26న కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని నదిమాబాద్‌కు చెందిన వనస కమలాకర్ (22), ఆలం సాయి (22), ఉప్పుల సంతోష్ (25), ఎల్ముల ప్రవీణ్ (23) హోలీరోజు మిత్రులతో కలిసి స్నానం చేసేందుకు తాటిపల్లి సమీపంలోని వార్ధానదికి వెళ్లారు. లోతుకు వెళ్లి ఈత రాకపోవడంతో నీట మునిగి మృత్యువాత పడ్డారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- చిన్నారులకు నిపుణుల సమక్షంలో లేదా తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఈత నేర్పించాలి.
- ఈత రానివారు నేరుగా నీటిలో దిగకుండా సేఫ్టీ జాకెట్ తప్పనిసరిగా ధరించాలి.
- ఈత వచ్చినవారు సైతం నీళ్లు ఎంతలోతు ఉన్నాయి? అనేది ముందుగానే గమనించిన తర్వాతే నీటిలోకి దిగాలి. లేదంటే ప్రమాదం సంభవించే అవకాశం ఉంటుంది.
- చెరువులు, కుంటలు, ఇతర జలాశయాల్లో అడుగున బురద పేరుకుపోయి ఉంటుంది. కావున అందులోని పరిస్థితిని తెలుసుకోకుండా దూకితే ప్రమాదాల బారిన పడుతారు.
- చెరువులు, వాగులు, ఇతర జలాశయాల వద్ద అధికారులు తప్పనిసరిగా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
- రైతులు వ్యవసాయ బావుల చుట్టూ కంచెను ఏర్పాటు చేసి అందులోకి ఎవరూ దిగకుండా చర్యలు చేపట్టాలి.

అవగాహన లేక..



గ్రామాలలో చెరువులు, కాలువలు, కుంటలు, వాగుల్లోకి ఈతకు వెళ్లిన వారు వాటిపై సరైన అవగాహన లేకపోవడంతోనే లోతులోకి వెళ్లి నీటమునిగి ఊపిరి ఆడకపోవడంతో మృత్యువాత పడుతున్నారు. నేను ఇప్పటి వరకు గోదావరిలో మునిగిన సుమారు వందమంది ప్రాణాలు కాపాడాను.

– సాయిలు, గజ ఈతగాడు, గాంధీనగర్

సేఫ్టీ జాకెట్ ధరించాలి



ఈతకు వెళ్లే సమయంలో లైట్ సేఫ్టీ జాకెట్ ధరిస్తే ప్రమాదం సంభవించదు. ఎలాంటి సేఫ్టీ నిబంధనలు పాటించకనే ప్రమాదాలకు గురవుతున్నారు. ఈతకు వెళ్లినప్పుడు ఒకరిద్దరు కాకుండా గుంపుగా స్నానం చేయాలి. ప్రమాదవశాత్తు ఒకరు మునుగుతున్నా మిగిలిన వారు కాపాడవచ్చు.

– జింక లక్ష్మీనారాయణ, గజ ఈతగాడు, నిర్మల్

ఓ కంట కనిపెట్టాలి



ప్రస్తుతం పాఠశాలలకు వేసవి సెలవులు రానున్నాయి. పిల్లలు ఇంటిపట్టునే ఎక్కువగా ఉంటారు. ఇలాంటి సమయంలో వారిని వేసవి శిబిరాలకు పంపించాలి. లేదంటే ఇంటిపట్టున ఉండే పిల్లలను తల్లిదండ్రులు అనుక్షణం కనిపెడుతూ ఉండాలి. స్నేహితులతో కలిసి బయటకు వెళ్తే తరచూ వాకబు చేయాలి.

– పి.సాయన్న, పోషకుడు

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం


రోదిస్తున్న కుటుంబ సభ్యులు


రాంచరణ్ (ఫైల్)

లక్ష్మణచాంద: సరదాగా ఈతకు వెళ్లిన విద్యార్థి ప్రాణాలు కోల్పోయిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వడ్యాల్‌కు చెందిన మద్దెల గంగన్న–లక్ష్మి దంపతుల కుమారుడు రాంచరణ్(14) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాల ముగిసిన తరువాత గ్రామ సమీపంలోని వాగుపై గల చెక్ డ్యామ్ వద్దకు ఈతకు వెళ్లాడు. అదే సమయంలో సరస్వతి కాలువ ద్వారా సదర్‌మాట్ కోసం వాగులోకి ఎక్కువ మోతాదులో నీటిని వదలడంతో గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు చెక్‌డ్యామ్ వద్ద వెతుకగా రాంచరణ్ ప్యాంటు, షర్ట్, పాదరక్షలు లభించాయి. ఆదివారం గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది వెతుకగా మృతదేహం లభించింది. 'పద్నాలుగేళ్లకే నూరేళ్లు నిండాయా లడ్డూ.. నీళ్లలో నీవు ఎలా నిదుర పోయావురా..నీవు లేకుండా మేము ఎలా బతకాలిరా.. నన్నుకూడా నీతో తీసుకుపోరా.. అంటూ మృతుని తల్లి కుమారుడి మృతదేహంపై పడి రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మాలిక్ రెహమాన్ తెలిపారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

లక్ష్మణచాంద(నిర్మల్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఖానాపూర్, బాదన్‌కుర్తి గ్రామాలకు చెందిన భూమరాజం, రాజేశ్వర్ ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై ఖానాపూర్ నుంచి నిర్మల్ వైపు వెళ్తుండగా కనకాపూర్ గ్రామ సమీపంలో కుస్తాపూర్‌కు చెందిన మల్యాద కారులో వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఘటనలో భూమరాజం, రాజేశ్వర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. భూమరాజం ఫిర్యాదు మేరకు మల్యాదపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మాలిక్ రెహమాన్ తెలిపారు.

పోస్టుమార్టం గదికి తాళం .. ఆటోలోనే మృతదేహం..!


ఆటోలో మృతదేహం

భైంసాటౌన్: బాసర నుంచి గుర్తు తెలియని మృతదేహాన్ని ఆదివారం ఆటోలో భైంసాలోని ప్రభుత్వ ఏరియాస్పత్రికి తీసుకొచ్చారు. పోస్టుమార్టం గది వద్ద సిబ్బంది లేకపోవడంతో దాదాపు 20 నిమిషాలపాటు మృతదేహాన్ని ఆటోలోనే ఉంచాల్సి వచ్చింది. కొద్దిసేపటికి వార్డుబాయ్‌ని పిలిపించగా మృతదేహాన్ని పోస్టుమార్టం గదిలోకి మార్చారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నిర్మల్‌టౌన్: పట్టణ శివారులో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల వివరాల మేరకు స్థానిక బంగల్‌పేట్ కొమ్మ గుట్ట చెరువు ప్రాంతంలో దాదాపు ఐదురోజుల క్రితం వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య


లక్ష్మి (ఫైల్)

బెజ్జూర్: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రానికి చెందిన సుంకరి లక్ష్మి (55) కుటుంబ కలహాలతో శనివారం రాత్రి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108లో కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి భర్త సుంకరి పురుషోత్తం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

కారును ఢీకొన్న లారీ..


ఘటన స్థలంలో క్షతగాత్రులు

జగిత్యాలక్రైం: దైవ దర్శనానికి వచ్చిన భక్తులు రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఘటన ఆదివారం జగిత్యాల రూరల్ మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌కు చెందిన కడెం శ్రీరాం, ల్యాంద్రి మున్నా, దన్నూరి ప్రణీత్, కారెపు రుషి, కడెం విశ్వంత్, భూమేశ్, రిషికరుణ్, నిమ్మల నర్సయ్య, కారే మధు ఆదివారం కొండగట్టు దైవదర్శనానికి వచ్చారు. అక్కడి నుంచి ధర్మపురి పుణ్యక్షేత్రానికి వెళ్లారు. తిరుగుప్రయాణంలో జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న లారీ కారును ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో జగిత్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొంతమంది పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. రూరల్ ఎస్సై సదాకర్ ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

పోలీసులమని చెప్పి చైన్ అపహరణ


పర్సు చూపుతున్న రామవ్వ

లక్ష్మణచాంద: పోలీసులమనిచెప్పి వాహనాన్ని ఆపి మహిళ బంగారు గొలుసు అపహరించిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వడ్యాల్ గ్రామానికి చెందిన ఇప్ప (కొత్తూర్) రామవ్వ ఆదివారం మధ్యాహ్నం తమ బంధువుల వివాహ వేడుకలకు హాజరయ్యేందుకు తమ ఇంటిపక్కనున్న భీమేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై నిర్మల్ బయలుదేరింది. కనకాపూర్ జాతీయ రహదారిపై ఇద్దరు వ్యక్తులు తాము పోలీసులమని చెప్పి బైకును ఆపారు. ముందు హత్య జరిగిందని, అటువైపు వెళ్లడం సరికాదని మెడలో ఉన్న బంగారు గొలుసు తీసి లోపల పెట్టుకోవాలని సూచించారు. దీంతో సదరు మహిళ మెడలోని 4 తులాల బంగారు గొలుసు తీసి తన పర్స్‌లో పెట్టుకునే క్రమంలో తాము పెట్టి ఇస్తామని చెప్పి తీసుకుని మళ్లీ పర్సు ఇచ్చారు. అనంతరం వారు అక్కడి నుండి జారుకున్నారు. మహిళ పర్సు తీసి చూడగా అందులో చైన్‌కు బదులు రాళ్లు కనిపించడంతో లబోదిబోమంది. రామవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాలిక్ రెహమాన్ తెలిపారు.

జాతీయ రహదారి పరిశీలన

కనకాపూర్ జాతీయ రహదారిని నిర్మల్ ఏఎస్పీలు రాజేశ్‌మీనా, ఉపేందర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన కొత్తూరు రామవ్వ నిర్మల్‌లో తమ బంధువుల పెళ్లి ఉండగా తన ఇంటి పక్కనున్న వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తోంది. ఈ క్రమంలో కనకాపూర్ జాతీయ రహదారిపై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు పోలీసులమని చెప్పి ఆమె వద్ద ఉన్న బంగారం ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఏఎస్పీలు ఘటనా స్థలాన్ని పరిశీలించి రామవ్వ ద్వారా వివరాలు సేకరించారు. ఘటనపై వేగంగా విచారణ చేపట్టాలని ఎస్సై మాలిక్ రెహమాన్‌ను ఆదేశించారు.

మాయమాటలు చెప్పి గొలుసు అపహరణ

బేల: మండలంలోని పాటన్ గ్రామ శివారులోని ఆర్టీసీ బస్ షెల్టర్ వద్ద ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని ఆపి మహిళ వద్ద నుంచి బంగారు గొలుసు అపహరించిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్సై దివ్యభారతి తెలిపిన వివరాల మేరకు జైనథ్ మండలంలోని కొఠ గ్రామానికి చెందిన వందన, సంతోష్ దంపతులు మాంగ్రుడ్ గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పాటన్ బస్ షెల్టర్ సమీపాన హైవేపై ఎదురుగా బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు దంపతుల ద్విచక్ర వాహనాన్ని ఆపి మేం పోలీసులమని.. మీరు వెళ్లే దారిలో హత్య జరిగిందని, మెడలో బంగారం ధరించి ఉంటే అక్కడ తీసుకుంటారని చెప్పారు. మీ మెడలో ఉన్న గొలుసు తీసి ఇస్తే కాగితంలో చుట్టి ఇస్తామని చెప్పడంతో నమ్మిన ఆ మహిళ చైన్ తీసి వారికి ఇచ్చింది. దీంతో కాగితంలో చుట్టిన బంగారాన్ని ఇవ్వాల్సిన దుండగులు మరో కాగితపు పొట్లాన్ని ఇచ్చి పరారయ్యారు. కొద్దిదూరం వెళ్లాక ఆ కాగితపు పొట్లాన్ని విప్పి చూడగా అందులో గొలుసుకు బదులుగా అక్షింతలు, రాళ్లు కనిపించడంతో లబోదిబోమంది. బేల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న ఎస్సై వెళ్లే దారిలోని సీసీ పుటేజీలను పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


ప్రకాశ్ (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సాలెవాడ(కె) గ్రామానికి చెందిన కోవ ప్రకాశ్ (47), కనక దత్తు ఆదివారం ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్‌కు వెళ్తుండగా ఇంద్రవెల్లి నుండి ఉట్నూర్ వైపు వెళ్తున్న బైక్ పులిమడుగు సమీపంలో మూల మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కోవ ప్రకాశ్‌కు తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108 ద్వారా ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బాధితుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మహిళ..

భైంసారూరల్: భైంసా–నిర్మల్ జాతీయ రహదారిపై తిమ్మాపూర్ గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. జాతీయ రహదారిపై గుర్తు తెలియని మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందింది. మహిళకు 40 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉంటుందని, చేతిపై నేతాజీ అని పచ్చబొట్టు రాసి ఉందని, ఎరుపురంగు చీర ధరించి ఉందన్నారు. మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రి పోస్టుమార్టం గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే భైంసారూరల్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వాంకిడి: మద్యం తాగవద్దని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇందాని గ్రామానికి చెందిన చెంద్రి లచ్చుంబాయి చిన్న కుమారుడు చెంద్రి సంతోష్(35) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం తల్లితో పాటు అతని భార్య కల్పన మందలించారు. దీంతో మనస్తాపానికి గురై రాత్రి అందరు పడుకున్న సమయంలో చీరతో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. మృతుని తల్లి లచ్చుంబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్య

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): భోరజ్ మండలం పెన్‌గంగ సమీపంలోని డొల్లార గ్రామ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్యకు గురైనట్లు జైనథ్ ఎస్సై పురుషోత్తం తెలిపారు. మృతుని వయస్సు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఛాతి భాగంలో కత్తితో పొడవడంతో శరీరంలోని పేగులు బయటకు వచ్చాయన్నారు. ముఖంపై కత్తితో పొడిచి గాయపర్చారన్నారు. ముఖం గుర్తుపట్టకుండా బండ రాయితో కొట్టినట్లు ఉందన్నారు. మృతుడు నలుపు రంగు టీషర్ట్, జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, మహారాష్ట్రవాసిగా అనుమానిస్తున్నామన్నారు. ఎక్కడో హత్య చేసి ఇక్కడ పడేసి ఉండవచ్చని ఎస్సై వివరించారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే జైనథ్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్‌రూరల్: రాబోయే విద్యాసంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి ఈనెల 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ డేనియల్ తెలిపారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో బెల్లంపల్లిలో 80 సీట్లు (బాలురు), నిర్మల్ పట్టణంలోని సోఫీనగర్ గురుకుల పాఠశాలలో (బాలికలు) 80 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. మే 10న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

తొడసం కట్టికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న తుమ్మగూడ గ్రామస్తులు

ఇంద్రవెల్లి: 1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో జరిగిన సభకు సారథ్యం వహించిన తుమ్మగూడకు చెందిన తొడసం కట్టి స్మారక జెండా వద్ద ఆదివారం ఉదయం గ్రామస్తులు ఘనంగా నివాళులర్పించారు. అంతకుముందు తుమ్మగూడ నుంచి సంప్రదాయ వాయిద్యాలతో రాంనగర్‌చౌక్ వద్ద ఉన్న స్మారక జెండావద్దకు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. తొడసం కట్టి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మగూడ గ్రామ పెద్దలు కనక హనుమంత్‌రావ్, సోయం వినోద్, ఆత్రం జల్పత్‌రావ్, మడావి శేకు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు

భైంసాటౌన్: పట్టణంలోని సాత్‌పూల్ వంతెన వద్ద ఆటో బోల్తా పడిన ఘటనలో పలువురు గాయాలపాలయ్యారు. స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం ముధోల్ వైపు నుంచి ప్యాసింజర్లతో వస్తున్న ఆటో భైంసాలోని సాత్‌పూల్ వంతెన వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఘటనలో ఆటో బోల్తా పడగా, అందులోని ప్రయాణికులు నిజామాబాద్‌కు చెందిన సుశ్మిత, సతీష్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కల్లూరుకు చెందిన మరో ఇద్దరు మహిళలు, చిన్నారులకు గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో క్షతగాత్రులను ఏరియాస్పత్రికి తరలించారు.

ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క


వెహికిల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ఉట్నూర్‌రూరల్: నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లోని వైటీసీలో గిరిజన నిరుద్యోగులకు ఆర్టీసీ ఆదిలాబాద్ రీజియన్ సహకారంతో హెవీ వెహికిల్ మోటార్ ట్రైనింగ్ ప్రోగ్రాంను ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 59 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు తెలిపారు. త్వరలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 4 వేల అంగన్‌వాడీ పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆర్టీసీని గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ప్రజా ప్రభుత్వం వచ్చిన వెంటనే పూర్వ వైభవం తీసుకొస్తున్నామన్నారు. యువత ఖాళీగా ఉండకుండా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం దేవుగూడ గిరిజన ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బెంచీలు అందజేశారు. ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీ నగేశ్, ఎమ్మెల్సీ విఠల్, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌కేపీలో రెండు చోరీలు

- 10 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు


నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఏసీపీ రవికుమార్

రామకృష్ణాపూర్: పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో రెండు చోరీల ఘటనలను పోలీసులు ఛేదించారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ స్థానిక పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హనుమాన్‌నగర్‌కు చెందిన ఇరుముల్ల శరణ్య ఆదివారం తెల్లవారుజామున తన ఇంట్లో కిటికీ పక్కన నిద్రిస్తుండగా ఆమె మెడలో ఉన్న మూడు తులాల పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తి తస్కరించాడు. అదే కాలనీలో బుర్ర రాజేంద్రప్రసాద్ ఫోన్‌ను కూడా కిటికీ నుండే దొంగిలించాడు. సమాచారం అందుకున్న పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసుల సహకారంతో పలు బృందాలుగా ఏర్పడి విచారణ ప్రారంభించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడు గోదావరిఖనిలోని కాకతీయకాలనీకి చెందిన గుంజ ఇమ్మానుయేల్‌గా గుర్తించారు. మధ్యాహ్నం నిందితుడిని స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రి వద్ద ఎఫ్‌టీటీజెడ్ బైక్‌పై వెళ్తుండగా పట్టుకున్నారు. అతని జేబులో ఉన్న మూడు తులాల గొలుసు, ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. రెండు కేసులను ఛేదించడంలో ప్రముఖ పాత్ర వహించిన మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, పట్టణ ఎస్సై రాజశేఖర్, కాసిపేట ఎస్సై ప్రవీణ్, క్రైంటీమ్ సిబ్బందిని ఏసీపీ అభినందించి రివార్డులను అందజేశారు.

రాపల్లిలో నాలుగిళ్లలో చోరీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాపల్లిలో నాలుగిళ్లలో చోరీ జరిగింది. ఎస్సై స్వరూప్‌రాజ్ కథనం మేరకు ఈనెల 18న గ్రామానికి చెందిన కాల్ల రమ, ఊట్నూరి అంజయ్య, ఊట్నూరి లక్ష్మి, ఊ ట్నూరి విశాల్ ఇళ్లలో చోరీ జరిగింది. కాల్ల రమ ఇంట్లో పావుతులం బంగారు పుస్తెలు, ఊట్నూరి లక్ష్మి ఇంట్లో 18 తులాల వెండి ప ట్ట గొలుసులు అపహరించారు. రమ ఫిర్యాదు మేరకు చోరీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రీడా సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం తగదు

- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి


మాట్లాడుతున్న చైర్మన్ శివసేనారెడ్డి

ఆదిలాబాద్: క్రీడా సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, తెలంగాణ క్రీడా పాఠశాలను ఆదివారం ఆయన పరిశీలించారు. స్టేడియంలోని సౌకర్యాలు, క్రీడ పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలను గురించి డీవైఎస్‌వోను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను గుర్తించి క్రీడల్లో వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ దిశగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్పోర్ట్స్ పాఠశాలలో సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేయొద్దని డీఎస్‌ఏ అధికారులను ఆదేశించారు. క్రీడా పాఠశాలలోని విద్యార్థులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. హాస్టల్, జిమ్‌ను పరిశీలించి, మరిన్ని సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విన్నవిస్తానని స్పష్టం చేశారు. త్వరలోనే శిక్షకుల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఏ అధికారులు, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి, జైనథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విలాస్ పటేల్, యువజన కాంగ్రెస్ బేల మండల అధ్యక్షుడు గోడే అవినాష్, కిసాన్ కాంగ్రెస్ బేల అధ్యక్షుడు ఘన్‌శ్యామ్, మాజీ సర్పంచ్ రూప్ రావు, రమేశ్ పటేల్, ఠాక్రే సాగర్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


ఉట్నూర్‌రూరల్: పూర్వ గురువులతో పూర్వ విద్యార్థులు


జన్నారం: అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

జన్నారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1982–83 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు 42 ఏళ్ల తర్వాత, ఉట్నూర్ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1989–90 బ్యాచ్ విద్యార్థులు 35 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. మళ్లీ అదే పాఠశాలలను వేదికగా ఏర్పాటు చేసుకుని అంతా ఒకేచోట కలుసుకుని పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని జరుపుకున్నారు. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఉల్లాసంగా గడిపారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. – జన్నారం/ఉట్నూర్‌రూరల్